సాక్షి
పల్నాడు
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023





## పెరుగుతున్న పల్నాటి వీరాచారం

కారెంపూడి: పల్నాటి వీరాచారం పెరుగుతోంది. శుక్రవారం ప్రకాశం జిల్లా నుంచి పది మంది వీరాచారవంతులు కారెంపూడి వచ్చి వీరుల అయుధాలకు పునఃప్రతిష్ట చేయించుకున్నారు.



## నాట్కో రూ.4.2 లక్షల విరాళం

గుంటూరు వెస్ట్: టీబీ పేషెంట్ల పోషక ఆహారం కోసం నాట్కో ఫార్మా కంపెనీ ప్రతినిధులు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి రూ.4.20 లక్షల చెక్కును కలెక్టరేట్‌లో అందజేశారు.




## బాధ్యతలు స్వీకరించిన కర్నాటి

దుర్గగుడి చైర్మన్‌గా కర్నాటి రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి హాజరయ్యారు. - ఇంద్రకీలాద్రి

## న్యూస్‌రీల్

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 551.70 అడుగుల వద్ద ఉంది. ఇది 213.5390 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,350, ఎడమ కాలువకు 8,986, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 17,203, ఎస్‌ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 39,059 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 4,553 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 825.60 అడుగుల వద్ద ఉంది. ఇది 45.3174 టీఎంసీలకు సమానం.

### ఎన్నికల పరిశీలకులుగా కోన శశిధర్

బాపట్ల: ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా కోన శశిధర్‌ను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియను కోన పరిశీలిస్తారు. ఎన్నికల నిర్వహణలో సమస్యలు ఉంటే 93919 23114 సెల్ నంబరుకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉందని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

### యార్డులో 1,12,995 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,06,231 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,12,995 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.21,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.25,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,610 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### త్రికోటేశ్వరుడికి బంగారు రుద్రాక్ష మాల



నరసరావుపేట రూరల్: కోటప్పకొండపై కొలువైన త్రికోటేశ్వరస్వామికి చిలకలూరిపేటకు చెందిన విడదల వేణుగోపినాథ్, స్ఫూర్తి దంపతులు రూ.4.40 లక్షల విలువైన 80 గ్రాముల బంగారు రుద్రాక్షమాలను బహూకరించారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో స్వామి సన్నిధిలో బంగారు రుద్రాక్ష మాలను దాతలు ఆలయ ఈవో వేమూరి గోపికి అందజేశారు. బంగారు రుద్రాక్ష మాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించి దాతలకు తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో అర్చక స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఏప్రిల్ 4న 'కలెక్టర్ ట్రోఫీ'

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా ఏర్పాటై ఏప్రిల్ 4వ తేదీకి సంవత్సరం కావస్తున్నందున అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, యువతను కలుపుకొని కలెక్టర్ ట్రోఫీ పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల పట్టణంలో ఓ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో రెవెన్యూ, సివిల్, వెల్ఫేర్, లా అండర్ ఆర్డర్ ప్రభుత్వ ఉద్యోగులను నాలుగు విభాగాలుగా ఏర్పాటు చేసి ఈ ట్రోఫీని నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో యువతను కూడా భాగస్వాములను చేసి వారిని కూడా మండలానికి ఒక జట్టును ఎంపిక చేసి పోటీలు నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కలెక్టర్ ట్రోఫీ క్రీడలను నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు వివరించారు. మార్చి, ఏప్రిల్‌లో పరీక్షలు ఉంటాయి కాబట్టి మే నెలలో యువతకు పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తామని తెలియజేశారు.

# చెరువుకు స్వేచ్ఛ

## పల్నాడు జిల్లాలో కబ్జాకు గురైన ఆరు చెరువులు

- చెరువులను కాపాడాలని లోకాయుక్తకు వెళ్లిన న్యాయవాది కోటేశ్వరరావు
- 6 చెరువుల పరిధిలో 110.8 ఎకరాలు అన్యాక్రాంతమైనట్టు గుర్తించిన అధికారులు
- కబ్జాదారుల నుంచి చెరువులను కాపాడి, పునరుద్ధరణ చేయాలని ఆదేశించిన లోకాయుక్త
- జలజీవన్ మిషన్‌లో భాగంగా చెరువులను అభివృద్ధి చేయనున్న డ్వామా అధికారులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



యడ్లపాడు మండలంలోని కారుచోల గ్రామ చెరువు వ్యూ

సాక్షి, నరసరావుపేట: కొన్ని చెరువులు ఆక్రమణదారుల చెరలో చిక్కుకోవడం రూపురేఖలు కోల్పోవడం జరుగుతోంది. చెరువులకు నీరు సరఫరా చేసే వరద కాలువలను సైతం అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమించుకొని తమ పొలాల్లో కలుపుకుంటున్నారు. ఈ క్రమంలో భారీ వర్షాలకు సైతం చెరువులు పూర్తి స్థాయిలో నిండటం లేదు. ఇలా చెరువులు ఆక్రమణలకు గురికావడంతో చెరువుల విస్తీర్ణం కుంచించుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. దీంతో ఆయకట్టు రైతులు, చెరువులపై ఆధారపడిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన సామాజికవేత్త, న్యాయవాది అయిన పచ్చల కోటేశ్వరరావు లోకాయుక్తకు 2016 సంవత్సరంలో ఫిర్యాదు చేశారు. ప్రస్తుత పల్నాడు జిల్లా పరిధిలోని ఆరు చెరువులను గట్టు పక్కనే ఉండే రైతులు ఆక్రమించి, వాటి పరిధిని తగ్గిస్తున్నారని అందులో పేర్కొన్నారు. సాగునీటి వనరు కోసం కేటాయించిన భారీ చెరువులు క్రమేణ తగ్గిపోతున్నాయని, భవిష్యత్ నీటి అవసరాల కోసం వాటిని సంరక్షించాలంటూ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన లోకాయుక్త పలుమార్లు విచారణ జరిపి ఆక్రమణకు గురైన చెరువులను సంరక్షించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. సర్వే నిర్వహించి ఆక్రమణలు ఎంతమేరకు జరిగాయో పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని కోరింది.

**ఆక్రమణల గుర్తింపు..**

లోకాయుక్త ఆదేశాల మేరకు మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు చెరువు భూముల ఆక్రమణలను సర్వే ద్వారా గుర్తించారు. చెరువులు ఆక్రమణలకు గురైన వాటిలో యడ్లపాడు మండలంలోని మైదవోలు, కారుచోల, యడ్లపాడు, నాదెండ్ల మండలంలోని గొరిజవోలు, నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, నకరికల్లు మండలంలోని కంకలగుంట్ల చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 110.8 ఎకరాల భూములు కబ్జాకు గురైనట్టు అధికారులు గుర్తించారు. వెంటనే అధికారులు చెరువు భూముల ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. కబ్జాకు గురైన పలు చెరువుల భూములకు విముక్తి కలిగిస్తున్నామని పంచాయతీరాజ్, మైనర్ ఇరిగేషన్ శాఖలు లోకాయుక్తకు నివేదిక సమర్పించాయి. 2023 ఫిబ్రవరి 21న లోకాయుక్త సదరు భూముల్ని స్వాధీనం చేసుకుని ఆయా భూములకు పూర్తిస్థాయి రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



నకరికల్లు మండలంలోని కుంకలగుంట గ్రామ చెరువు

**జలశక్తి అభియాన్ ద్వారా పనులు..**

ఆక్రమణలకు గురైన చెరువులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పునరుద్దరించి సమీపంలోని రైతుల పొలాలకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, కొన్నింటిలో జలశక్తి అభియాన్‌ పథకం ద్వారా నీటి నిల్వలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టామని చైర్మన్‌ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డికి అధికారులు నివేదిక సమర్పించారు. రానున్న రెండు నెలల్లో చెరువుల హద్దులను గుర్తించి, చుట్టూ కందకాలను ఏర్పాటు చేస్తామని ఇరిగేషన్‌ అధికారులు తెలిపారు. జలజీవన్‌ మిషన్‌లో భాగంగా ఆయా చెరువుల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అన్యాక్రాంతమైన చెరువు భూములను తిరిగి వెనక్కి తెస్తుండటంతో ఆయకట్టు పరిధిలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యలతో సాగునీటికి ఢోకా లేదంటున్నారు.

### చెరువుల చుట్టూ కందకాలు తవ్వుతాం



చెరువుల సంరక్షణకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే చేసి సరిహద్దులు గుర్తిస్తే ఉపాధి హామీ పథకం ద్వారా కందకాలు తవ్వుతాం. సరిహద్దుల చుట్టూ ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపడతాం. చెరువుల్లో వర్షపు నీరు చేరేలా జల సంరక్షణ పనులు కూడా చేపడతాం. జలశక్తి అభియాన్ ద్వారా పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

– జోసఫ్‌కుమార్, డ్వామా పీడీ, పల్నాడు జిల్లా

### ఆక్రమణలు తొలగించడం శుభపరిణామం



చెరువు భూములను ఆక్రమించడంతో నానాటికీ పరిధి తగ్గిపోతోంది. ఈ సమయంలో చెరువులను సర్వే చేసి చెరువు వాస్తవ పరిధిని గుర్తించి ఆక్రమణలు తొలగించి, రక్షణ చర్యలు తీసుకోవడం శుభపరిణామం. దీనివల్ల పూర్తిస్థాయిలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, చివరి ఆయకట్టు వరకు నీరు చేరుతుంది.

– కె.వీరారెడ్డి, గొరిజవోలు, నాదెండ్ల మండలం

## నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

యడ్లపాడు మండలం తిమ్మాపురంలో ఏర్పాటు



తొలిరోజు పొగాకు కొనుగోలు చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

యడ్లపాడు: నల్లబర్లీ పొగాకు రకానికి కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ ప్రకారంగా గిట్టుబాటు అందించనున్నట్లు జీపీఐ కంపెనీ మేనేజర్ కోట ఉమామహేష్ చెప్పారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో జీపీఐ, యూఎల్‌టీ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ప్రకాశం జిల్లాలో అత్యధికంగా నల్లబర్లీ సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ఏటా 10 నుంచి 15వేల హెక్టార్ల విస్తీర్ణంలో నల్లబర్లీ రకాన్ని రైతులు సాగు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది 12వేల హెక్టార్లలో వీటిని సాగు చేశారన్నారు. తమ కంపెనీ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా ఈ ప్రాంతంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడో ఏటా ప్రారంభించిన ఈ కేంద్రం వచ్చే జూలై వరకు ఉంటుందన్నారు. పొగాకు రైతులు తమ వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు తేమ లేకుండా గ్రేడ్ చేసుకుని కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఒక్కో రైతు ఎంత ఉత్పత్తినైనా తీసుకురావచ్చని ఉదయం 8 గంటల నుంచి కేంద్రం ప్రారంభం రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు. సంబంధిత రైతులు తమ ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్లతో సరుకు తీసుకురావాలని కోరారు. నాలుగు జిల్లాలకు చెందిన పొగాకు రైతులు తమ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని మంచి గిట్టుబాటు ధరను పొందాలని ఆకాంక్షించారు.





ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్‌కుమార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు మంత్రులు, న్యాయమూర్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు శుభాభినందనలు తెలుపుతున్న మంత్రులు మేరుగ నాగార్జున, అంబటి రాంబాబు, విడదల రజిని -సాక్షి ఫొటోగ్రాఫర్

# ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు

## 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు నిర్వహణ

- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 192 కేంద్రాలు
- హాజరుకానున్న 35,881 మంది విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఆదివారం నుంచి మార్చి 7వ తేదీ వరకు జరగనున్న ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్)కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియెట్ విద్య ఆర్‌ఐవో గన్నెపూడి సునీత తెలిపారు. సాంబశివపేటలోని ఆర్‌ఐవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాక్టికల్స్‌కు హాజరు కానున్న 35,881 మంది విద్యార్థులకు 192 కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. నాన్ జంబ్లింగ్ విధానంలో జరిగే ప్రాక్టికల్స్‌కు హాజరుకానున్న విద్యార్థుల్లో ఎంపీసీ 28,772 మంది, బైపీసీ 7,117 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12, తిరిగి మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే ప్రాక్టికల్స్‌కు హాల్ టికెట్ కలిగిన విద్యార్థులను అర్ధగంట ముందుగా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. మూడు స్పెల్స్‌లో జరగనున్న ప్రాక్టికల్స్‌లో 400 మందికి మించిన విద్యార్థులు ఉన్న కళాశాలల్లో అదనంగా మరో ప్రాక్టికల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఏ, బీ సెంటర్లుగా విభజించినట్లు చెప్పారు.



సమావేశంలో ఆర్‌ఐవో సునీత, పక్కన శేఖర్‌బాబు

**అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా**

ప్రాక్టికల్స్ సెంటర్లలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని, ఇంటర్‌బోర్డు నుంచి ఉన్నతాధికారులు లైవ్ స్ట్రీమింగ్ విధానంలో ప్రత్యక్షంగా పరిశీలిస్తారని చెప్పారు. కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ ఒక్కరే సెల్ ఫోన్ కలిగిఉండాలని, మిగిలిన సిబ్బంది ఎవ్వరి దగ్గర ఫోన్లు ఉండేందుకు అనుమతి లేదన్నారు. ప్రాక్టికల్స్ పూర్తవ్వగానే అక్కడికక్కడే పేపర్ల వాల్యుయేషన్ పూర్తి చేసి, సీల్డ్ కవర్‌లో సీఎస్‌కు అందజేయాలని పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీలకు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థికీ హాల్ టికెట్ ఇవ్వాలని యాజమాన్యాలను ఆదేశించారు. విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకున్నా, కళాశాలల్లోని ప్రయోగ కేంద్రాల్లో ఏమైనా సమస్యలున్నట్లయితే గుంటూరు ఆర్‌ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ (0863-2228528)కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో డీఈసీ సభ్యుడు టి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మాచవరంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

మాచవరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. మాచవరం మండలంలో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, అభివృద్ధి కార్యక్రమాల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు కార్యాలయంలో కుప్పలుగా పడి ఉన్న పాత రికార్డులను చూసి, రికార్డులను వెంటనే గదిలో భద్రపర్చాలని సూచించారు. రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని తెలియజేశారు. అభివృద్ధి కార్యక్రమాలపై మండల పరిషత్ అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ద్వారా మంజూరైన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కాన్పుల గదులు, రోగులకు వసతి కల్పన, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. ఉద్యోగుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాలని సూచించారు. అనంతరం పిల్లుట్లలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. మెనూ, వసతి తదితర అంశాలపై సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఆట స్థలాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ద్వారా సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. రుక్మిణీపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీడీఓ వై.రాజగోపాల్, డీటీ సుబ్బారావు, ఏపీఎం శివశంకర్, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏఈలు సురేష్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పక్కన సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: వైఎస్సార్ రైతు భరోసా లబ్ధిదారులకు మూడో విడత ఆర్థిక సాయం, పంటలు నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కోసం ఈ నెల 27వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టణానికి విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ శుక్రవారం సమీక్షించారు. అవసరమైన సూచనలను చేశారు. ముందుగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే బహిరంగ సభా ప్రాంతం, కవిరాజ నగర్‌లోని హెలిప్యాడ్ ప్రాంతాన్ని అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డు, చుట్టుపక్కల ప్రాంతాల్లో దారి వెంట బారికేడ్లను నిర్మించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద గ్రీన్‌రూమ్, టెంట్లను ఏర్పాటు చేయాలని, రైతులు సభకు వచ్చి వెళ్లేందుకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ అనిల్‌కుమార్, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కె.కోటేశ్వరరావు, తెనాలి డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్, పొన్నూరు పోలీసు అధికారులు, స్పెషల్ బ్రాంచి సీఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీలకు మేలు చేసింది వైఎస్సార్ కుటుంబమే

- మాచర్ల నియోజకవర్గంలో రూ.కోటితో ముస్లింల అభివృద్ధికి చర్యలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పీఆర్కే



ఈద్గాలో దువా నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

**మాచర్ల:** రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి తొలుత కృషి చేసింది మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డేనని, ఆయన బాటలోనే నడుస్తూ మైనార్టీలకు మేలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతోందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. శుక్రవారం 23వ వార్డులోని ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.32 లక్షలతో నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.కోటి నిధులు మైనార్టీలకు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మాచర్ల, రెంటచింతల, కారంపూడిలో ముస్లింలకు కమ్యూనిటీ హాళ్లతోపాటు ఈద్గా అభివృద్ధికి రూ.30 లక్షల సొంత నిధులు ఖర్చు చేసినట్టు వివరించారు. వైఎస్సార్ కుటుంబం ముస్లింలకు చేసిన మేలు ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. రాబోయే రోజులలో ప్రతి ముస్లిం పేద కుటుంబానికీ ఇంటి స్థల పట్టా అందించి రుణాలు మంజూరు చేయించి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పీఆర్కే చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మైనార్టీ నేతలు రాష్ట్ర బ్యూటీషియన్ డైరెక్టర్ ఉప్పలపాటి జానీ, మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ జలీల్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, శ్రీనివాసశర్మ, కౌన్సిలర్లు మురళి, షేక్ సుభాని, దస్తగిరి, షేక్ కరిముల్లా, మస్తాన్, మైనార్టీ నాయకులు షేక్ సులేమాన్ బాషా, సీలింగ్ బాషా, కణితి మస్తాన్, ట్రాక్టర్ కరిముల్లా, రెహమాన్, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఈఈ నాగభూషణం పాల్గొన్నారు.

# సీఎం జగన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- కాసు బ్రహ్మానందరెడ్డికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వటం సంతోషం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

**దాచేపల్లి:** పల్నాటికి గుండెకాయలాంటి అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేకి కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేగా నామకరణం చేయటం శుభపరిణామం అని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాసు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దివంగత సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేగా నామకరణం చేయటాన్ని యావత్తు పల్నాడు ప్రజానీకం హర్షిస్తుందని చెప్పారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తూ తాము కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని అన్నారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన బ్రహ్మానందరెడ్డి రాజకీయంగా ఎదిగారని గుర్తు చేశారు. నాగార్జునసాగర్, పోచంపాడు ప్రాజెక్ట్‌లకు అత్యధికంగా నిధులు తెచ్చి సకాలంలో పూర్తిచేసేలా కృషి చేశారని, హైదరాబాద్‌లాంటి మహానగరంలో భారీ పరిశ్రమలు రావటానికి బ్రహ్మానందరెడ్డి కృషి చేశారని చెప్పారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని తీసుకువచ్చిన ఘనత బ్రహ్మానందరెడ్డికే దక్కుతుందని, పేదవారికి ఇళ్ల కట్టించేందుకు ఎల్ఐసీ ద్వారా రుణాలు తీసుకువచ్చి పేదల సొంతింటి కలను సాకారం చేశారని పేర్కొన్నారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, మందపాటి వీరారెడ్డి, నాగుబండి గురువులు, ఈదా వెంకటరెడ్డి, నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, ముశ్యం వెంకటేశ్వర్లు, సూర్రెడ్డి తదితరులున్నారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి టెన్నిస్ టోర్నమెంట్

**నరసరావుపేటఈస్ట్:** శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల క్రీడా మైదానంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు నరసరావుపేట టెన్నిస్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు నంద్యాల నరసారెడ్డి, కార్యదర్శి మిరియాల ప్రసాదు, ఇన్‌చార్జి కె.రవిశంకర్ శుక్రవారం తెలిపారు. టోర్నమెంట్‌లో పురుషులు డబుల్స్, 45సంవత్సరాలు డబుల్స్, 55 సంవత్సరాలు డబుల్స్, 65 సంవత్సరాలు డబుల్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

# అనుమతులు లేకుండా రాష్ట్ర రహదారిపై ధర్నా

- రెవెన్యూ సిబ్బంది పట్ల దురుసు ప్రవర్తన
- టీడీపీ నాయకులపై కేసులు నమోదు

**రొంపిచర్ల:** రాష్ట్ర రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ అనుమతులు లేకుండా ధర్నా చేయటంతోపాటు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డిపై అతని సమీప బంధువు, అదే పార్టీకి చెందిన పమ్మి వెంకటేశ్వరరెడ్డి దాడికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. మృతిని నిరసిస్తూ రొంపిచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సుమారు రెండు గంటలు రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతోపాటు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని ఆందోళన విరమించాలని టీడీపీ నాయకులకు సర్ది చెప్పారు. అయినప్పటికీ వినకుండా రెండు గంటల సేపు రోడ్డుపై బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరించి వారి విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు వీఆర్వో సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**చదలవాడపై కేసు నమోదు**

**నరసరావుపేటరూరల్:** నరసరావుపేట–చిలకలూరిపేట రోడ్డులోని ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద బాలకోటిరెడ్డి మృతదేహంతో ధర్నా నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో సహా 30 మందిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా దాదాపు గంటన్నరపాటు ధర్నా నిర్వహించినట్లు వీఆర్వో రత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు శుక్రవారం రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపారు.

# పట్టా భూములకు మాత్రమే క్రమబద్ధీకరణ'

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

**సత్తెనపల్లి:** పట్టా భూములకు మాత్రమే సాదా బైనామా క్రమబద్ధీకరణ జరుగుతుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ చెప్పారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం సాదా బైనామా క్రమబద్ధీకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తెల్లకాగితాలపై షరతులు లేకుండా వివాదరహితంగా ఉండి 2021 నవంబర్ ఒకటికి ముందు రాసుకున్న అన్ రిజిస్టర్డ్ కాగితాలు ఉన్న రైతులు గ్రామ సచివాలయంలో కానీ మీసేవ కేంద్రాల ద్వారా సాదా బైనామాల క్రమబద్ధీకరణ కోసం సంబంధిత తహసీల్దారులకు ఈ ఏడాది డిసెంబర్ 31 లోపు అర్జీలు దాఖలు పరుచుకోవాలన్నారు. 30 రోజుల కాలవ్యవధిలో జీవో ఎంఎస్ నెంబర్ 661 నిబంధనల ప్రకారం విచారించి క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందన్నారు. క్రమబద్ధీకరణలో సన్న, చిన్నకారు రైతులకు రిజిస్ట్రేషన్ రుసుం కూడా పూర్తిగా మినహాయింపు ఉంటుందన్నారు. క్రమబద్ధీకరణ కేవలం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టా భూములకు మాత్రమే వర్తిస్తుందని, అసైన్‌మెంట్, డీకే పట్టాల విషయంలో జరిగిన అగ్రిమెంట్లకు, బాగ పంపిణీలు, వీలునామాలు క్రమబద్ధీకరణ పరిధిలోకి రావన్నారు. గతంలో ఉన్న నిబంధనల కంటే ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు రైతు సోదరులకు అనుకూలంగా చాలా సరళతరంగా ఉన్నాయన్నారు. సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీటీసీ కాల్వపల్లి రమేష్‌రెడ్డి, సర్పంచ్ తిప్పిరెడ్డి సుజాత, పాకాలపాడు సొసైటీ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మాతృమరణాలు మరెక్కడా జరగకుండా చూడండి

జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శోభారాణి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు, కమిటీ సభ్యులు

**నరసరావుపేట:** మాతృమరణాలు ఎక్కడా చోటుచేసుకోకుండా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు కృషిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో మాతృ మరణాలపై ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి మాసంలో చోటుచేసుకున్న మాతృ మరణాలను కమిటీ సభ్యులు ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులు, బాధితులను విచారించి మరణం సంభవించడానికి గల కారణాలను విశ్లేషించారు. తదుపరి ఇలాంటి మరణాలు ఎక్కడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తదుపరి లింగ నిర్ధారణ చట్టం, 1994పై పోస్టరు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి, నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బీవీ.రంగారావు, జిల్లా డెప్యూటీ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ గీతాంజలి, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ నాగపద్మజ, డాక్టర్లు మంత్రూనాయక్, వసంత రాయ, హనుమకుమార్, ఆశాలు, ఏఎన్ఎంలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఆదాయం పెంపునకు ప్రత్యేక చర్యలు

- ఏపీఎస్ఆర్టీసీ ఈడీ ఆదం సాహెబ్
- ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం



ఫిల్లింగ్ పాయింట్‌ని ప్రారంభిస్తున్న ఈడీ ఆదంసాహెబ్

**వేటపాలెం:** ఏపీఎస్ఆర్టీసీకి ఆదాయం పెంపుకోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే ఆదంసాహెబ్ పేర్కొన్నారు. వేటపాలెం మండలం వేటపాలెం–చీరాల ప్రధాన రోడ్డు పక్కన పాత ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్‌ని ఈడీ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు రీజనల్ పరిధిలో మొట్టమొదటిసారిగా వేటపాలెంలో ఫిల్లింగ్ స్టేషన్‌ని ఏర్పాటు చేశామన్నారు. ఈ స్టేషన్ ద్వారా వాహనదారులకు నాణ్యమైన డీజిల్, పెట్రోల్ అందుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ స్థలాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ఆదాయం పెంపుకోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్గో సేవల ద్వారా ప్రతి ఏడాది సంస్థకు రూ.250 కోట్లు ఆదాయం సమకూర్చుతున్నట్లు తెలిపారు. రాబోవు కాలంలో ఆదాయాన్ని రూ.500 కోట్లకి పెంచేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీనితో పాటు కమర్షియల్ ద్వారా కూడా మరో రూ.500 కోట్లు ఆదాయ సమకూర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. వివిధ మార్గాల ద్వారా సంస్థకు వచ్చిన ఆదాయంతో ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడానికి కృషిచేస్తామని వివరించారు. కార్యక్రమంలో కమర్షియల్ చీఫ్ మేనేజర్ పీ చంద్రశేఖర్, వివిధ ఆర్టీసీ డిపో మేనేజర్లు శ్రీనివాసరెడ్డి, అజితకుమారి, కే శ్యామల సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రావీణ్యంతో సవాళ్లను అధిగమించొచ్చు


ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ జాన్సన్



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ నాగభూషణం

**గుంటూరు ఎడ్యుకేషన్:** క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించిన విద్యార్థులకు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థతతో అధిగమించగలరని ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ పి.జాన్సన్ పేర్కొన్నారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో స్పర్ధ పేరుతో ఏర్పాటు చేసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. క్రీడాంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా గెలుపు, ఓటములను తేలిగ్గా తీసుకునే ఆత్మ విశ్వాసం కలుగుతాయని అన్నారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ముందుగా క్రీడాజ్యోతిని వెలిగించిన ప్రొఫెసర్ జాన్సన్, పావురాలను, బెలూన్లను ఎగురవేశారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి కబడ్డీ రిఫరీ వెలగా అమ్మయ్య, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ అజిత్‌బాబు, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపిక



ప్రశంసాపత్రం, మెమెంటో అందుకుంటున్న విద్యార్థి

**అద్దంకి:** రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు మండంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. 9వ తరగతి విద్యార్థి షేక్ మహ్మద్ అబ్దుల్ ఖుర్షిద్ అఫ్జల్ ప్రదర్శించిన ప్రాజెక్టు ఎంపికైనట్లు హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, 24న బాపట్లలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రదర్శనలో ద్వితీయ స్థానం పొందిన విద్యార్థి ప్రాజెక్టు 'ఎకో ఫ్రెండ్లీ పియాజో ఎలక్ట్రిసిటీ' ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థికి గైడ్‌గా ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఎస్ జే శ్రీనివాసరావు వ్యవహరించారు. మరో విద్యార్థి ఎస్వీ పార్థసాయి తయారుచేసిన 'మదర్స్ స్మార్ట్ అండ్ హెల్దీ కిచెన్' ప్రాజెక్టు జిల్లాలో ద్వితీయ స్థానం పొంది రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైందని తెలిపారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును అభినందించారు.